ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 13 నవంబరు 2024



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

పార్వతీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా యువజన సర్వీసుల శాఖాధికారి డి.రామగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెపారు. నాలుగు నియోజకవర్గాల పరిధిలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రవాణా శాఖ సిబ్బంది సహకారంతో 14వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం పాలకొండ ప్రభుత్వ బాలికల కళాశాలలో, 14న కురుపాం మండలం గొటివాడలో రహదారి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే సాలూరులో చేపట్టినట్లు వెల్లడించారు.



పాలకొండ: పొట్లిలో లింగాకారంలో దీపాలు వెలిగించిన దృశ్యం

ఏకాదశి.. ఆధ్యాత్మికత వెల్లివిరిసి..

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన హరి నామం



సాలూరులో పూజలందుకున్న వేణుగోపాలస్వామి

పార్వతీపురం టౌన్/సాలూరు/సాలూరు రూరల్/పాలకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి)

ఏకాదశిని పురష్కరించుకుని జిల్లాలోని వైష్ణవ దేవాలయాలన్నీ మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. అర్చనలు, అభిషేకాలతో వేంకటేశ్వరస్వామి, కృష్ణుడు, రాముడ్ని ఆరాదించారు. వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తజనం గంటలకొద్దీ నిరీక్షించారు. అనంతరం స్వామి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహిళలు ధ్వజ స్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. కొన్నిచోట్ల సామూహిక పూజలు చేశారు. పార్వతీపురం పట్టణంలోని రామా సత్యనారాయణ, కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో వ్రతాలు, పూజలు చేశారు. సాలూరులో పురాతన వేణుగోపాలస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజామున రెండు గంటల నుంచే పెద్ద ఎత్తున భక్తజనం తరలిరావడంతో ఆలయ ప్రాంగణం నాటి జాతీయ రహదారి వరకు క్యూలైన్లు కొన సాగాయి. ఎవరికీ ఎటువంటి కలగకుండా పోలీసులు భద్రత కల్పించారు. జిల్లాలోని కురుపాం, పాలకొండతో పాటు మండలాల్లో కూడా వేంకటేశ్వరస్వామి, రామా లయం ఆలయాల్లో మధ్యాహ్నం వరకూ భక్తుల రద్దీ తగ్గలేదు. పాలకొండ మండలంలోని పొట్లి గ్రామంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. లింగాకృతిలో వెలిగించిన దీపాలను చూడడానికి సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. మొత్తంగా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



పార్వతీపురం రమా సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు ఇలా..



సాలూరు వేణుగోపాలస్వామి ఆలయం బయట బారులు తీరిన భక్తజనం

ఆ ఊరి ఉపాధి
కోడి
- చికెన్ సెంటర్లతో ఆదాయం
- 40 శాతం కుటుంబాలకు ఆధారం
- ఇదీ పీఆర్‌రాజు పేట ప్రత్యేకత

6లో

అపార్ నమోదుపై ఆరా

భామిని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో అపార్ నమోదుపై ఇన్‌చార్జి డీఈవో ఎస్.తిరుపతినాయుడు ఆరా తీశారు. మంగళవారం భామిని జడ్పీ పాఠశాల, అంబేడ్కర్ గురుకులం, గిరిజన ఆశ్రమ పాఠశాల, ఏకలవ్యతో పాటు జూనియర్ కళాశాలలను సందర్శించారు. అపార్ నమోదులో వెనుకంజలో ఉన్న పాఠశాలలను గుర్తించి మానటరింగ్ చేయా లని ఆదేశించారు. ఆధార్‌లో తప్పులు ఉంటే పాఠశాల హెచ్ఎం, ఎంఈవో ధ్రువపత్రాలతో సరిచేయాలన్నారు. అనంతరం కేజీబీవీ, హైస్కూల్ విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. జూనియర్ కళాశాలలో అపార్ నమోదును వేగవంతం చేయాలని ప్రిన్సిపాల్ నారాయణ రావుకు సూచించారు. ● గుమ్మ లక్ష్మీపురం: తాటిసీల ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను ఇన్‌చార్జి డీఈవో సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ఏం జరుగుతుందో?

- ఎమ్మెల్సీ ఎన్నికపై స్టే ఇచ్చిన కోర్టు
- ఇప్పటికీ ఎటూ తేల్చని ఈసీ
- దిక్కుతోచని స్థితిలో అధికార యంత్రాంగం, రాజకీయ వర్గాలు

విజయనగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికపై ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. కోర్టు తీర్పు తర్వాత ఎన్నికలు ఆగిపోయినట్టేనని అంతా అనుకున్నారు. కానీ ఎన్నికల కమిషన్ కోర్టు తీర్పును ఇప్పటికీ అమలు చేయలేదు. మరోవైపు నామినేషన్ల ఉపసంహరణ గడువు సమీపిస్తోంది. దీంతో ఏం జరగబోతుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. అధికార యంత్రాంగం ఎటు తేల్చుకోలేక ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను అనుసరిస్తోంది. ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజునే కొనసాగించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు రఘురాజు చెబుతున్నారు. మరోవైపు కోర్టు తీర్పు ప్రతిని అందుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్‌యాదవ్ విషయాన్ని సీఈసీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేకంగా లేఖ కూడా రాశారు. అయినా అక్కడి నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. శాసనమండలి ఛైర్మన్ తీరును కోర్టు తోసిపుచ్చింది. వివరణ తీసుకోకుండా ఎలా రఘురాజుపై అనర్హత వేటు వేస్తారని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో అటు శాసనమండలి ఛైర్మన్ సైతం దీనిపై స్పందించడం లేదు. చేసేదిలేక యంత్రాంగం ఎన్నికల ప్రక్రియ కొనసాగిస్తోంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి చిన వెంకట అప్పలనాయుడు ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. ఇందుకూరి రఘురాజు భార్య ఎస్.కోట వైఎస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఎన్నికలకు ముందు నారా లోకేశ్ సమక్షంలో ఆమెతో పాటు ఎస్.కోట నియోజకవర్గ వైసీపీ కేడర్ టీడీపీలోకి వెళ్లింది. ఇటీవలే రఘురాజు భార్య సుబ్బలక్ష్మికి టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని ప్రకటించారు. కానీ ఆమె అనూహ్యంగా ఇండిపెండెంట్‌గా పోటీ చేయడం వ్యూహాత్మకమని తెలుస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎస్.కోట మండలం వసి గ్రామానికి చెందిన కోరుకొండ వెంకటరావు సైతం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికలు జరిగితే త్రిముఖ పోటీ తప్పేలా లేదు.

నామినేషన్ల పరిశీలన



విజయనగరం కలెక్టరేట్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి మూడు నామినేషన్లు వచ్చాయి. వాటిని మంగళవారం రిటర్నింగ్ అధికారి జేసీ సేతు మాధవన్, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు ఎంఎం నాయక్‌లు సంయుక్తంగా పరిశీలించారు. అన్నీ సరిగా ఉన్నట్లు ప్రకటించారు. అభ్యర్థుల వివరాలను నోటీసు బోర్డులో పెడతామని తెలిపారు. 14న మధ్యాహ్నం 3 గంటల లోపల విత్ డ్రాయల్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

విప్‌గా కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



పార్వతీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని విప్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. ఎంపీటీసీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన జగదీశ్వరికి తొలుత టీడీపీ అధిష్ఠానం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. ఆ తరువాత ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని కల్పించింది. తొలిసారిగా కురుపాం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన జగదీశ్వరిని ప్రభుత్వం విప్‌గా నియమించడంపై శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే సాలూరు ఎమ్మెల్యే సంధ్యారాణి మంత్రిగా వ్యవహరిస్తుండగా.. జగదీశ్వరిని విప్‌గా నియమించడంతో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించినట్లయ్యిందని కార్యకర్తలు, అభిమానులు భావిస్తున్నారు.

ఆనందంగా ఉంది..

'తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన నన్ను ప్రభుత్వం గుర్తించి విప్‌గా నియమించడం ఎంతో ఆనందంగా ఉంది. పార్టీ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తా. టీడీపీ పటిష్ఠత, జిల్లా అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా.' అని ఎమ్మెల్యే జగదీశ్వరి తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

విద్యార్థి మృతిపై పునర్విచారణ

జియ్యమ్మవలస, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అలమండ పంచాయతీ ఆర్ఆర్‌బీ పురం టీడబ్ల్యూఏహెచ్ (బాలుర) స్కూల్‌లో ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్‌కుమార్ (12) మృతిపై మంగళవారం రీ-ఎంక్వైరీ జరిగింది. ఈ నెల 6న విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై రీ-ఎంక్వైరీ చేయాలని ప్రజా సంఘాల ఆందోళనకు దిగడంతో పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ కమిటీ వేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పద్మావతి, ఐటీడీఏ డీడీ మహమ్ముద్దీన్ గయాజుద్దీన్, డిప్యూటీ డీఈవో పీసీహెచ్ మోహనరావు, తహసీల్దార్ రెడ్డి పకీరు, ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబులు పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థి మృతిపై విచారణ చేపట్టారు. తోటి విద్యార్థులు సుధీర్, సిద్ధు , శ్యామ్యూలు, పవన్‌కుమార్, ప్రేమ్‌కుమార్ లతో మాట్లాడి.. వారి నుంచి వ్యక్తిగత విచారణ పత్రాలు తీసుకున్నారు. తరువాత పాఠశాల హెచ్ఎం ఎస్.తిరుపతి, డిప్యూటీ వార్డెన్ ఎల్.గణపతిరావు, ఆఫీసు సబార్డినేట్ వెంకటేష్ వద్ద స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. పూర్తి నివేదికను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోకు అందజేస్తామని విచారణ అధికారులు తెలిపారు.

ప్రతి అర్జీపై పర్యవేక్షణ

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పార్వతీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీని పక్కాగా పర్యవేక్షించ నున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖ క్షుణ్ణంగా అధ్యయం చేసి.. సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి.. చేర్పులు, మార్పులపై తెలియజేయాలని సూచించారు. సాగు నీటి సంఘాల ఎన్నికలకు నియమితులైన అధికారులు, సిబ్బందికి ఈ నెల 14న శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుక పొందడానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శోభిక, డ్వామా పీడీ రామచంద్రరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందించి.. వేదన తీర్చి..

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సిబ్బందిని ఆదుకున్న ప్రభుత్వం
- 'ఉపాధి' నుంచి వేతనాలు మంజూరు
- నాలుగు విడతల్లో 18 నెలల బకాయిల చెల్లింపులకు ఆదేశం
- వైసీపీ సర్కారు హయాంలో దారుణ పరిస్థితి
- తాజాగా కూటమి చర్యలతో హర్షం

గరుగుబిల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లను కూటమి ప్రభుత్వం ఆదుకుంది. వారి కష్టాలకు చెక్ పెట్టింది. గత వైసీపీ సర్కారు హయాంలో సుమారు 18 నెలల పాటు అందించని వేతనాలను విడతల వారీగా చెల్లించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆ శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా 2014లో అప్పటి టీడీపీ హయాం ఉపాధి హామీ పథకంలో భాగంగా కొంతమంది సైట్ ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లను నియమించింది. వీరికి ఆప్కాస్ నుంచి వేతనాలు అందేవి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మారింది. 'సిబ్బందిలో అధికంగా టీడీపీకి చెందిన వారే ఉన్నారు.. మీ అవసరం మాకు లేదు.' అని ఖరాఖండిగా చెప్పింది. అంతేగాకుండా వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగింది. వేతనాలు అందించక పలు ఇబ్బందులకు గురిచేసింది. ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లకు చెందిన వాటాను ఆప్కాస్‌కు జమ చేయలేదు. పంచాయతీరాజ్ శాఖకు టీఏలు అవసరమని ప్రత్యేక కమిటీ 2023 ఫిబ్రవరిలో సిఫారసులు చేసినా పట్టించుకోలేదు. టెక్నికల్ అసిస్టెంట్లు, సైట్ ఇంజనీర్లకు పరిపాలనా నిధుల నుంచి 3 శాతం మేర వేతనాల కింద చెల్లించాలని నిబంధనలు పెట్టింది. అయితే ఆ నిధులు కూడా మంజూరు కాకపోవడంతో సమస్యను అప్పటి సీఎం జగన్, ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. మరోవైపు టెక్నికల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని అర్హత మేరకు సచివాలయాల పరిధిలోనే ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా నియమించాలని రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో గత వైసీపీ సర్కారు కన్నెర్ర జేసింది. వారిని విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే సిబ్బందికి అనుకూలంగా తీర్పు రావడంతో వేతనాలు అందించక పోయినా గత 18 నెలలుగా నిబంధనల మేరకు వారు విధులు నిర్వహిస్తున్నారు.

వారి విధులివీ..

పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, సైట్ ఇంజనీర్లు పంచాయతీలు, మండలాల పరిధిలో అవసరమైన రహదారులు, సీసీ కాలువలు, ప్రభుత్వ భవనాలకు సంబంధించి అంచనాలు తయారు చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలన, బిల్లులు తయారీతో పాటు ప్రత్యేక పర్యవేక్షణ బాధ్యత వారిపై ఉంది. ప్రభుత్వపరంగా నెలకు రూ. 18,500 వేతనంగా నిర్ణయించారు.

ప్రభుత్వం దృష్టికి..

క్షేత్రస్థాయిలో ఎదుర్కొన్న సమస్యలు, వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలను యూనియన్ ప్రతినిధులు కూటమి సర్కారుకు వివరించారు. ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాసరావు, గుమ్మిడి సంధ్యారాణి, రాష్ట్ర ఉన్నతాధి కారులకు వినతిపత్రాలు అందించారు. దీనిపై స్పందించిన కూటమి ప్రభుత్వం జిల్లాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి.. వేతనాల చెల్లింపునకు ఆదేశాలిచ్చింది. 2023 జూన్ నుంచి 2024 సెప్టెంబరు వరకు బకాయి పడిన వేతనాలను నాలుగు విడతలుగా (వచ్చే ఏడాది మార్చిలోగా) చెల్లించాలని ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు రూ.24.99 కోట్లకు ఆమోదం లభించింది. కాగా గతంలో సిబ్బందికి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి వేతనాలు అందేవి. ప్రస్తు తం పీఆర్ డీడీవో కోడ్‌ను తప్పించి ఉపాధి హామీ పథకానికి సంబంధించి డీడీవో కోడ్‌లను అమలు పర్చారు. ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయడంతో

-మిగతా 8వ పేజీలో...



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది (ఫైల్)

ఎస్సీ, ఎస్టీ చట్టాలు సమర్థవంతంగా అమలు కావాలి

- సీఐడీ విశాఖ రీజియన్ ఏఎస్పీ ప్రేమకాజల్

కురుపాం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుల వివక్ష లేని సమాజం ఏర్పడాలంటే ఎస్సీ, ఎస్టీ చట్టాలు సమర్థవంతంగా అమలు కావాలని సీఐడీ విశాఖ రీజియన్ ఏఎస్పీ జి.ప్రేమకాజల్ అన్నారు. మంగళవారం కురుపాంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఏపీ క్రైమ్ ఇన్విస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, అత్యాచార నిరోధక చట్టం-1989పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వివక్ష, అత్యాచారాలు పూర్తిగా అంతరించాలంటే చట్టాలు పకడ్బందీగా అమలవ్వాలని తెలిపారు. తప్పు చేసిన వారిపై పూర్తిస్థాయిలో ఎఫ్ఐఆర్, చార్జిషీట్ నమోదు చేయాలన్నారు. సాక్ష్యాలు బలంగా ఉండేలా చూసుకోవడం ముఖ్యమని చెప్పారు. విశాఖ రీజియన్ డీఎస్పీ కుమారస్వామి, సీఐ ఎం.బుచ్చిరాజు మాట్లాడుతూ.. 35 ఏళ్ల కిందట చట్టాలు అమలులోకి వచ్చినా.. ఇంకా కుల వివక్ష కేసులు నమోదు కావడం దురదృష్టకరమన్నారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.జోగారావు, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఎస్సీ, ఎస్టీ సాధికారిత షెడ్యూల్డ్ అధికారి గయాజుద్దీన్, ఎల్విన్‌పేట సీఐ హరి, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్ రమణమ్మ, ఎస్ఐలు హరిబాబు, పి.నారాయణరావు, శివప్రసాద్, గిరిజన సంఘం నాయకులు ఐ.రామకృష్ణ, లోవరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎస్పీ ప్రేమకాజల్ తదితరులు


ఆ ఊరి ఉపాధి కోడి



- చికెన్ సెంటర్లతో ఆదాయం
- 40 శాతం కుటుంబాలకు ఆధారం
- ఇదీ పీఆర్‌రాజు పేట ప్రత్యేకత



పాలకొండ ఆంజనేయ సెంటర్ వద్ద చికెన్ సెంటర్


పీఆర్‌రాజుపేట గ్రామం

పాలకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి)

వేకువజామున మేలుకొలిపే సజీవ యంత్రమది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అదే అందరికీ అలారం. ఉషోదయ వేళకు ముందే నిద్ర లేచే మహిళలు దైనందిన పనులకు శ్రీకారం చుట్టడానికి... శ్రామికులు.. రైతులు పొలం బాట పట్టడానికి... విద్యార్థులు ఉదయాన్నే లేచి చదువుకోవడానికి ఉపయోగపడే నడిచే గడియారం అది... అదే కోడి కూత. ఆ కోడికి ఇంకో ప్రత్యేకత ఉందండోయ్.. పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక ఊరిలో సగం భారాన్ని మోస్తోంది. ఆ ఊరు వారిని తనే పెంచుతోంది. అదేంటీ... కోడిని మనం పెంచుతాం కదా... కోడి ఊరిని పెంచడం ఏమిటీ? అంటారా? అయితే పాలకొండ మండలంలోని పీఆర్‌రాజుపేట (రుద్రిపేట) గ్రామానికి వెళదాం రండి. ఆ విశేషాలు తెలుసుకోవచ్చు.


చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్న యువకుడు

ప్రధాన ఉపాధి మార్గం..

డివిజన్ కేంద్రమైన పాలకొండకు మూడు కిలోమీటర్ల దూరంలోని వెలగవాడ పంచాయతీ పరిధిలో ఉన్న కుగ్రామం పీఆర్‌రాజుపేట (రుద్రిపేట). ఆ గ్రామంలో ఎంతో మందికి చికెన్ సెంటర్ల రూపంలో కోడి ఉపాధినిస్తోంది. 25 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన పల్లా రామినాయుడు పాలకొండలో ఓ చికెన్ సెంటర్ ప్రారంభించాడు. కొన్నాళ్ల తర్వాత చీర తవిటినాయుడు, రామారావు, పుండరి, నేరడబిల్లి ప్రసాద్, ఖండాపు ప్రకాష్‌తో పాటు మరికొంతమంది చికెన్ సెంటర్లనే ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. ప్రత్యక్షంగా... పరోక్షంగా ఆ గ్రామంలోని సుమారు 40 శాతం కుటుంబాలు చికెన్ సెంటర్ల ద్వారానే ఉపాధి పొందుతున్నాయి. కొంతమంది చికెన్ సెంటర్లు నిర్వహిస్తుండగా...వీరి వద్ద సుమారు 50 మంది వరకు పని చేస్తున్నారు. 400 మంది జనాభా గల ఆ గ్రామంలో 98 కుటుంబాలు ఉంటున్నాయి. వీరిలో 40 శాతం వరకు చికెన్ సెంటర్ల మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. దీనితో చికెన్ సెంటర్లే ఆ గ్రామానికి ప్రధాన ఆర్థిక వనరులుగా మారిపోయాయి. మాంసాహార ప్రియులకు తాజా చికెన్‌ను అందుబాటులో ఉంచి.. వారి అభిమానాన్ని చూరగొంటున్నారు. వీరు బ్రాయిలర్ చికెన్‌తో పాటు ఏజెన్సీ, మైదాన ప్రాంతాల వారి నుంచి నాటుకోళ్లు తెచ్చి అమ్ముతుంటారు. పాలకొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లు అయిన ఏలాం సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, వీరఘట్టం సెంటర్, మేదరవీధి, ఆంజనేయ సెంటర్, వడమ సెంటర్‌తో పాటు వెలగవాడ, సీతంపేట తదితర ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో చికెన్ సెంటర్లు, స్టాక్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి.

కోడి ఉపాధినిస్తోంది..

కోడి.. మా గ్రామంలోని ఎంతో మందికి ఉపాధినిస్తోంది. యువత చికెన్ సెంటర్లను ఆధారంగా చేసుకొని బతుకుతున్నారు. వీటితో కొంతమేర మాకు ఆర్థిక భరోసా ఇచ్చినట్టు అవుతోంది. 25ఏళ్ల క్రితమే మా గ్రామానికి చెందిన కొంతమంది చికెన్ సెంటర్లను ప్రారంభించారు. **-నేరబిల్లి ప్రసాద్, రుద్రిపేట**

కోడితోనే బతుకు..

గ్రామంలో సుమారు వంద కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 40 శాతం కుటుంబాలు చికెన్ సెంటర్ల ద్వారానే జీవనాధారం పొందుతున్నాయి. ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తే మరిన్ని చికెన్ సెంటర్లు ఏర్పాటు చేసుకొని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించినట్టు అవుతుంది. పౌల్ట్రీ పరిశ్రమల స్థాపనకు సబ్సిడీలు ఇచ్చి యువతను ప్రోత్సహించాలి. **-కె.ప్రసాద్, రుద్రిపేట**

వైభవంగా ఏకాదశి పూజలు


రాజాం రూరల్: రాజాంలోని మల్లికార్జునాలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు

విజయనగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో వచ్చే ఏకాదశికి ఎంతో విశిష్టత ఉందని భక్తుల నమ్మకం. మంగళవారం ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలతో పాటు వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. దీప, ధూప నైవేద్యాలు... అభిషేకాలతో వేంకటేశ్వర స్వామి, శ్రీకృష్ణ, రామాలయాల్లో పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని రింగురోడ్డులో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, బొబ్బిలి వేణుగోపాల స్వామి, నగరంలోని శివాలయం వీధిలో గల వేంకటేశ్వర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. రోజంతా ఉపవాస దీక్షల్లో ఉన్నారు.


బొబ్బిలి: వేణుగోపాల స్వామి ఆలయంలో దీపారాధన


విజయనగరంలో వేంకటేశ్వర స్వామికి పూజలు


పాలకొండ: కోదండరామాలయంలో పూజలు


భామిని: చిన్నదిమిలిలో హరేరామ నామస్మరణ చేస్తున్న మహిళలు


విజయనగరంలో వెంకన్న దర్శనానికి బారులు


రాజు పేట

ఊరి పేరుకీ ఉంది...

ప్రత్యేకత!

- వ్యక్తులు.. ఇళ్ల పేర్లతో గ్రామాలు
- బుస్సీ దొర బస చేసిన బూశాయవలస
- పాములోళ్లు నివసించిన పాముల వలస

బొబ్బిలి/ రూరల్/ తెర్లాం/ బాడంగి/ రామభద్రపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ఊరి పేరు భైరవకోన'.. ఇటీవల వచ్చిన ఓ సినిమా పేరిది. వినడానికి ఆసక్తికరంగా ఉండడంతో ప్రేక్షకుల దృష్టి ఆ సినిమాపై పడింది. ఇదే కోవలో మన జిల్లాలోనూ విభిన్నమైన... విచిత్రమైన పేర్లతో ఊళ్లు ఉన్నాయి. కొన్ని వ్యక్తుల పేర్లతోనూ... మరికొన్ని దేవుళ్ల పేర్లతోనూ.. ఇంకొన్ని వృత్తుల పేర్లతోనూ ఆవిర్భవించాయి. వాటి గురించి తెలుసుకుందాం.

'పాముల' వలస.. ఎలా వచ్చిందంటే..

బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బొబ్బిలి పట్టణం, మండలం, తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాల్లో వ్యక్తుల పేర్లతో అనేక గ్రామాలు ఉండడం గమనార్హం. తెర్లాం మండలంలో పాములను పెంచే తెగవారు ఆ గ్రామంలో భూములను కౌలుకు తీసుకొని పంటలు పండించేవారు. దీనితో ఆ గ్రామానికి పాములవలస అని పేరు వచ్చింది. ఆ తెగ వారు ప్రస్తుతం ఆ గ్రామంలో కనిపించడం లేదు. ఊరి పేరు మాత్రం పాములవలసగా స్థిరపడిపోయింది.

వ్యక్తుల పేర్లతో..

- తెర్లాం మండలంలో మాధవుడు అనే బ్రాహ్మణునికి బొబ్బిలి జమీందారులు గ్రామాన్ని దానంగా ఇవ్వడంతో దానికి ఎంఆర్ (మాధవరాయుని) అగ్రహారంగా పేరువచ్చింది. అగ్రహారం అంటే పూర్తిగా బ్రాహ్మణుల ఇలాకాయే. కాలగమనంలో బ్రాహ్మణులంతా వేర్వేరు ప్రాంతాలలో స్థిరపడడంతో బ్రాహ్మణుడే లేని అగ్రహారంగా ఆ గ్రామం స్థిరపడిపోయింది.
- తెర్లాం మండలంలో వ్యక్తుల పేర్లతో ఉన్న గ్రామాల చాలా ఉన్నాయి. గంగన్నపాడు, తమ్మయ్యపేట, రంగప్పవలస, చిన్నయ్యపేట, అప్పలమ్మపేటతో పాటు 'బూరి పేట' అనే ఊరు కూడా ఉంది.
- బాడంగి మండలంలో వ్యక్తుల పేర్లతో గోపాలకృష్ణ రంగరాయపురం (జీకేఆర్‌పురం) ఉంది. బొబ్బిలి రాజుల పేరుతో ఈ గ్రామం వెలసింది. తాండ్ర పాపారాయుడు బొబ్బిలి నుంచి రాజాంకు రాకపోకలు సాగించేటప్పుడు పినపెంకి-వెంకంపేట, ఆకులకట్ట గ్రామాల మీదుగా గుర్రాలపై వెళుతూ ఓ గ్రామంలో బస చేసేవారు. అందుకే ఆ ఊరి పేరు జీకేఆర్‌పురం అయింది. ఈ మండలంలో కామన్న వలస, మల్లమ్మపేట, గజరాయుని వలస, భీమవరం గ్రామాలు ఉన్నాయి.
- రామభద్రపురం మండలంలో జాతీయ రహదారిని ఆనుకొని బూశాయవలస గ్రామం ఉంది. బొబ్బిలి కోటపై విజయనగరం రాజులను యుద్ధానికి పురిగొల్పిన సందర్భంలో బుస్సీ దొర ఈ గ్రామంలో బస చేశాడు. అందుకే ఈ గ్రామానికి బూశాయ వలస అని పేరు వచ్చింది. ఈ మండలంలో 'నాయుడు'వలస, సీతారామపురం, 'పాల'వలస, నరసాపురం.. ఇలా వ్యక్తులు... ఇళ్ల పేర్లతో గ్రామాలు ఉన్నాయి.
- బొబ్బిలి పట్టణంలో రామన్నదొర వలస, దేవుళ్ల పేర్లతో రాముడు వలస, నారసింహునిపేట ఉండగా... గొర్లె సీతారామపురం, భోజరాజపురం, కాళిందొర వలస, నారాయణప్ప వలస అని వ్యక్తుల పేర్లతో ఊళ్లు ఉన్నాయి. పాతపెంట, కొత్తపెంట, మెట్ట వలస, దిబ్బగుడ్డి వలస, గున్నతోట వలస, చిత్రకోట బొడ్డవలస అని తమాషా పేర్లతోనూ గ్రామాలు ఉన్నాయి.

రాజులు వేటకు వెళ్లే మార్గంలో...

పూర్వం రాజులు వేటకు వెళ్లిన ప్రాంతాలలో వారి పేర్లతో గ్రామాలు కొనసాగుతున్నాయి. బొబ్బిలి మండలంలో రాజుపేట, గోపాలరాయుడిపేట, వెంకటరాయుడిపేట, నారసింహునిపేట, మల్లమ్మపేట తదితర గ్రామాలు రాజవంశీయుల పేర్లతో ఉన్నాయి. బొబ్బిలి పట్టణంలో ఒకటి, బాడంగి మండలంలో మరొకటి మల్లమ్మపేట అనే గ్రామాలు ఉన్నాయి.

పూర్వం కారడవులు..

పూర్వం మా ప్రాంత గ్రామాలన్నీ కారడవులే. అప్పట్లో బొబ్బిలి రాజులు ఇక్కడ అడవిలో జంతువుల వేటకు వచ్చేవారు. తరచూ వేటకు వచ్చి ఇక్కడ రాజులు విశ్రాంతి తీసుకోవడంతో మా ఊరికి రాజుపేట అనే పేరు స్థిరపడింది. మా చుట్టుపక్కల అనేక గ్రామాలు రాజవంశీయుల పేర్లతో ముడిపడి ఉన్నాయి. **-నాగిరెడ్డి రామారావు, రాజుపేట**

కలల కొలువు కోసం!

- పుస్తకాలతో అభ్యర్థుల కుస్తీ
- నగరంలోని వివిధ ప్రాంతాల్లో చదువులు


వీధి దీపాల వెలుతురులో...


చెట్ల నీడలో రేపటి కోసం...


గురజాడ కళాభారతి ప్రాంగణంలో...

విజయనగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ.. ఎంతోమంది అభ్యర్థులకు కలల కొలువును సాధించే మహా యజ్ఞం. దీనిలో తొలి అంకమైన టెట్‌కు జిల్లా వ్యాప్తంగా 23 వేల మంది వరకు హాజరయ్యారు. వీరిలో అత్యధిక శాతం అర్హత సాధించారు. ఇప్పుడు నేరుగా డీఎస్సీకి గురిపెట్టారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానుందన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాగైనా ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించి తీరాలన్న పట్టుదలతో చదువుతున్నారు. రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అనేక మంది జిల్లా కేంద్రంలోని వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. అంతేకాకుండా నగరంలోని కోట, గురజాడ గ్రంథాలయం, గురజాడ కళాక్షేత్రం పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు... మొబైల్ లైట్ల వెలుతురులో చదువుతున్నారు.


సెల్‌ఫోన్ వెలుగుల్లో...


కోట వద్ద పార్కులోని చెట్ల కింద డీఎస్సీ అభ్యర్థుల సాధన

న్యూస్ బాక్స్

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించనున్నారు. వారోత్సవాలను జిల్లా కలెక్టర్ ఈనెల 14న ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరు మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో ఆవిష్కరించారు.

నిత్యావసరాల పంపిణీ

విజయనగరం రూరల్, నవంబరు 12: నగరంలోని కణపాక ఆగురువీధిలో మారుతీ స్వయం సేవా సంఘం ఆధ్వర్యంలో 75 మంది నిరుపేదలకు, విభిన్నప్రతిభావంతులకు బియ్యం, ఇతర నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలాజీ ఫ్లోర్ మిల్ వీటీ అగ్రహారం ప్రతినిధులు నాగుమల్లి గణపతిరావు, పెంటపాటి మార్కేండేయులు, పెంటపాటి రాములు చేతుల మీదుగా నిత్యావాసరాలను పంపిణీ చేశారు. సంఘం ప్రతినిధులు గుత్తూరు చంద్రశేఖర్, అప్పలస్వామి, రామ్మోహన్, తులసీరామ్, వెంకటరావు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

రాజాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదే శించారు. మంగళవారం మండల పరిషత్ కా ర్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, డిజి టల్ అసిస్టెంట్‌లు, వీవోలు, మండల అధికా రులు సమన్వయంతో పనిచేసి ప్రణాళికలు అందజేయాలన్నారు. జిల్లా శిక్ష ణ పరిశీలకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గురజాడ సాహితీ పురస్కారానికి 'మీసాల' ఎంపిక

బొబ్బిలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని నాయుడుకాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మీసాల చినగౌరు నాయుడు గురజాడ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 30న జరిగే గురజాడ విశిష్ట పురస్కార మహోత్సవంలో మీసాల ఈ పురస్కారాన్ని అందుకుంటారు. రామభద్రపురం మండలం అప్పలరాజుపేట గ్రామానికి చెందిన బాడంగి మండలం గొల్లాది హైస్కూలులో లెక్కలు మాస్టారుగా పనిచేస్తున్నారు. కవి, రచయిత, కళాకారునిగాగుర్తింపు పొందారు.

గ్రీవెన్స్‌పై అలసత్వం వద్దు

రామభద్రపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలాల్లో వస్తున్న గ్రీవెన్స్‌లపై రెవెన్యూ అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ హెచ్చరించారు. మంగళవారం అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల్లో గ్రీవెన్స్ వినతులు పేరుకుపోతున్నాయని, పరిష్కరించడంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై ఎప్పటికప్పుడు అధికారులు సూచనలు, సలహాలు అందిస్తున్నా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులపై కూడా ఆరా తీశారు.

దుకాణాల వద్ద శుభ్రత పాటించాలి

రేగిడి, నవంబరు 12,(ఆంధ్రజ్యోతి): ఉంగరాడమెట్ట కూడలిలో దుకాణాల వద్ద శుభ్రత పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని రేగిడి ఎస్ఐ నీలావతి దుకాణదారులను హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంగరాడమెట్ట దుకాణాదారులతో మంగళవారం ఎస్ఐ చైతన్య సమావేశం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

విజయనగరం దాసన్నపేట, నవంబరు 12: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని రోడ్డు సేఫ్టీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. మంగళవారం అయ్యన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలలో రోడ్డు సేఫ్టీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యార్థి దశ నుంచే రోడ్డు ప్రమాదాల నుంచి అవగాహన కల్పించుకోవాలని, అలాగే రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. అలాగే తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించి రహదారిభద్రతకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టరు సాయికుమార్, ఎన్‌జీఓ ప్రతినిధులు శ్రీహరిబాబు, శ్రీరామమూర్తి, ఎం సత్యనారాయణ, హెడ్‌మాస్టర్ సూర్యకళతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

జామి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంత ప్రజల కష్టం తీర్చిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని మాజీ జడ్‌పీటీసీ బండారు పెదబాబు, రామయ్యపాలెం మాజీ సర్పంచ్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం అలమండ రైల్వేస్టేషన్‌నుంచి రామయ్యపాలెం, లొట్లపల్లి రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఈరోడ్డుపై ప్రయాణంతో ప్రజలు నరకం చూశారని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బాగుచేయించడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు.

ఆశా కార్యకర్తలకు అవగాహన

బాడంగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాడంగి, వాడాడ గ్రామాల్లో ఆయుష్ వైద్యంపై డాక్టర్ ఎస్.ఉమాదేవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలంతా గ్రామాల్లోకి క్షేత్రస్థాయిలో వెళ్లి ఇంటి వైద్యంతోపాటు మన పరిశరాల్లో లభించే వాటితో పలు రోగాల నివారణకు అవసరమైన వైద్యాన్ని వివరించాలన్నారు. వంటింటిలో దొరికి పలు వంటసామగ్రితో కొన్ని రోగాలను నయం చేసుకోవచ్చునని, వాటిపై గ్రామ స్థులకు అవగాహన కల్పించాలన్నారు.

నేవల్ పోర్టుకు 1700 ఎకరాల్లో స్థల సేకరణ

ఆర్డీవో మోహనరావు

బాడంగి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): బాడంగిలో నేవల్ పోర్టు నిర్మాణం కోసం 5 గ్రామాలకు సంబంధించి 1700 ఎకరాల్లో స్థల సేకరణకు ప్రయత్నాలు ప్రారంభించినట్టు బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్.మోహనరావు వెల్లడించారు. మంగళవారం విశాఖపట్టణం నుంచి నేవల్ ఆఫీసర్స్ అసిస్టెంట్ మేనేజర్ ఆర్‌వీ.సుబ్బారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జీవీఎస్ చైతన్యతో కలిసి బాడంగి వద్ద ఉన్న పాత ఎయిర్‌పోర్టుతోపాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో విలేఖర్లతో మాట్లాడుతూ నేవల్ బేస్ కార్యాలయానికి కోసం ముగడ, మల్లంపేట, పూడివలస, రామచంద్రపురం, కోడూరు గ్రామాలకు చెందిన భూముల వివరాలు సేకరించి త్వరలో నివేదికను నేవల్ అధికారులకు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ 5 గ్రామాలకు చెందిన భూములు అవసరంగా గుర్తించినట్టు ఆయన తెలిపారు. ఇక్కడ నేవల్ బేస్‌కు సంబంధించిన రసాయన ముడి సరుకులు, నిల్వ కేంద్రాల ఏర్పాటుకు 1700 ఎకరాలను సేకరించనున్నట్టు ఆయన చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ కే.సుధాకర్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.



భూములకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో, నేవల్ అధికారులు

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలి



న్యాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ చక్రవర్తి

విజయనగరం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ చక్రవర్తి అన్నారు. మంగళవారం ఉమ్మడి విజయనగరం జిల్లాలోని న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీపడదగిన క్రిమినల్ కేసులను, మోటారు ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మణి కేసులు, ప్రామసరీ నోటు కేసులు, ఎక్సైజ్, మున్సిపాలిటీ, కుటుంబ తగాదాలు, వంటి కేసులు ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలని సూచించారు. న్యాయాధికారులు ఎం మీనాదేవి, అప్పలస్వామి, పద్మావతి, టీవీ రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి..



పార్టీలోకి చేరినవారితో విక్రమ్

విజయనగరం దాసన్నపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవనాపు విక్రమ్ ఆధ్వర్యంలో నగరంలోని 34వ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన గుణసల శ్రీనివాసరావు, గెద్ద రామునాయుడు, వాసుదేవ్ తరుణ్‌తేజ్ ఆధ్వర్యంలో 35 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అప్పలరాజు, తురాల శ్రీనివాసరావు, పచ్చిగుళ్ల వెంకటరావు, బాలు, సతీష్, రవితేజ, మోపాడ ప్రశాంత్, విజయ్, నారాయణరావు, ఖాదర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ● విజయనగరం నాగవంశం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు అవనాపు విక్రమ్ అన్నారు. మంగళవారం సంఘ భవనంలో వనసమారాధనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

పైడిమాంబ ఆలయం వద్ద అన్నదానం



భోజనం వడ్డిస్తున్న మంత్రి భార్య

విజయనగరం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయం వద్ద మంగళవారం దేవస్థానం, పైడిమాంబ దీక్షాధారుల సంఘం, దాతల సహకారంతో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీమణి లక్ష్మీసింధు ప్రారంభించారు. అంతకుముందు ఆమె పైడిమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. ● పైడిమాంబను మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడిలో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మంగళవారం పైడిమాంబకు ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. ఉదయం 6 గంటలకు పైడిమాంబకు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనాన్ని కల్పించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందాలి

చీపురుపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందజేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలపై ప్రిన్సిపాల్ రాణిశ్రీతో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు వచ్చే మధ్య, పేద తరగతి పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందజేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు.

ప్రభుత్వంపై నిందలు మోపడం తగదు

గజపతినగరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల వ్యవదిలోనేమాజీ ఎమ్మెల్యే బొత్సఅప్పలనరసయ్య అపనిందలు మోపడం తగదని టీడీపీ సీనియర్ నాయకులు, అసెంబ్లీ పోల్‌మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ పి.వి.వి. గోపాలరాజు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో రాష్ట్రం దివాల తీయడానికి కారణం జగన్ కాదా అని ప్రశ్నించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను చూడలేక సహించలేక మాట్లాడడం తగదన్నారు. వైసీపి నాయకులతో చెప్పుంచుకోనే పరిస్థితి టిడిపికి లేదన్నారు. మాజీ జెడ్పిటిసి మక్కువ శ్రీదర్ మాట్లాడుతు మాజీ ఎమెమెల్యే వాస్తవాలుమరిచి మాట్లాడం శోచనీయమన్నారు. మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మండలపార్టీ అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్, కొండపల్లి బాస్కరనాయుడు, కోరాడ కృష్ణ, సీనియర్ నాయకులు రాంజీరాజు, లెంక బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీఎఫ్‌డీసీ చైర్మన్‌గా సుజయ్ బాధ్యతల స్వీకరణ



బొబ్బిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, జోనల్-2 కోఆర్డినేటర్, మాజీ మంత్రి రావు వెంకట సుజయ్‌కృష్ణరంగారావు ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్(ఏపీఎఫ్‌డీసీ) చైర్మన్‌గా బుధవారం సాయంత్రం మంగళగిరిలో పదవీబాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల జరిగిన పలు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో సుజయ్‌ను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఆయన పదవీ స్వీకార కార్యక్రమానికి బొబ్బిలి ప్రాంతం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివెళుతున్నారు.

బెల్టుషాపు నిర్వాహకులపై కఠినంగా వ్యవహరించాలి

● ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు

విజయనగరం క్రైం, నవంబరు 12: ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎక్కడైనా అనధికారికంగా బెల్టుషాపులు నిర్వహిస్తే, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు ఆదేశించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో జిల్లాలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంఆర్‌పీ ధరలు పాటించాలని, గ్రామాల్లో బెల్టుషాపుల కోసం వేలం పాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బొడ్డార చెక్‌పోస్టు వద్ద గంజాయి అక్రమ రవాణాకు ప్రత్యేక నిఘా పెట్టాలని, చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. బార్ రెస్టారెంట్‌లు, మద్యం షాపులు లైసెన్సు నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు, ఎక్సైజ్ సూపరిడెంట్ శ్రీనాదుడు, డిపో మేనేజరు గౌరీశ్వరరావుతో పాటు ఏఈఎస్‌లు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సువ్వారి అనురాధ



విజయనగరం రూరల్, నవంబరు 12:(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తాజాగా ప్రకటించిన వివిధ కార్పొరేషన్ల డైరక్టర్ల పదవుల్లో విజయనగరం నియోజకవర్గానికి చెందిన టీడీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సువ్వారి అనురాధకి కళింగ కార్పొరేషన్ డైరక్టర్‌గా అవకాశం లభించింది. ఆమె 1997లో టీడీపీ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించి, మూడు పర్యాయాలు జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా, నగర టీడీపీ మెంబరుగా బాధ్యతలు నిర్వహించారు. 2019 నుంచి 2024 వరకూ విజయనగరం పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి ఆమె తెలుగుమహిళా విభాగం తరఫున విశేష కృషి చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆమె సేవలను గుర్తించి, తాజాగా విడుదల చేసిన జాబితాలో కాళింగ కార్పొరేషన్ డైరక్టరుగా అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ, టీడీపీ నాయకులు చంద్రబాబు, నారా లోకేష్, అశోక్ గజపతిరాజు, అదితి గజపతిరాజుతో పాటు ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా కుసుమంచి



విజయనగరం దాసన్నపేట, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటించిన వివిధ కార్పొరేషన్ల డైరక్టర్ల పదవుల్లో విజయనగరం నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావుకు కార్పొరేషన్ డైరక్టర్ పదవి లభించింది. ఈయన ఆర్ఎస్ఎస్‌లో సేవలు అందించారు. బీజేపీలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, తొలుత పట్టణ కోశాధికారిగా, అధ్యక్షులుగా, అసెంబ్లీ కన్వీనర్‌గా, స్వచ్ఛభారత్ రాష్ట్ర కో కన్వీనర్‌గా పదవులు చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవాదళ్‌తో పాటు, కన్యకా పరమేశ్వరీ వృద్ధాశ్రమం, కుసుమంచి ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈయన సేవలను గుర్తించి కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌లో బీజేపీ తరఫున డైరక్టర్ పదవి ఇచ్చింది.

రైతులే బీమా ప్రీమియం చెల్లించాలి

రామభద్రపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): జీడిమామిడి పంటకు ఎకరానికి రూ.1500 చొపన బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని మండల ఉద్యానవనశాఖాధికారి పి.మోహనకృష్ణ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో 600 ఎకరాలలో జీడిమామిడి సాగు చేస్తున్నారని తెలిపారు. రైతు ఎకరానికి రూ.1500 చొపన బీమా ప్రీమియం చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాల కారణంగా జీడిమామిడి పంట నష్టం జరిగితే ఎకరానికి రూ.30వేలు చొపన బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు రామారావు, లావణ్య పాల్గొన్నారు.

రబీ సాగు విస్తీర్ణం పెరగాలి

రేగిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రబీ సాగు విస్తీర్ణం తగ్గుతున్న దృష్ట్యా పెసర, మినుప, మొక్కజొన్న విస్తీర్ణం పెంపునకు రైతులు ఆసక్తి కనబరచాలని జిల్లా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు(జేడీ) రామారావు రైతులకు సూచించారు. మండలంలో చాటాయివలస సచివాలయ గ్రామాల్లో గురువారం ఏవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రాజాం ఏడీ చంద్రరావుతో కలిసి జేడీ క్షేత్రస్థాయిలో చాటాయివలస పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సేద్యం, కషాయాల తయారీ, వినియోగంపై చాటాయివలస రైతులకు చైతన్యం కలిగించారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధివైపు అడుగులు వేయాలి

రేగిడి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధివైపు అడుగులు వేయాలని ఎంపీడీవో శ్యామలా కుమారి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జీపీడీపీపై సర్పంచ్‌లు, ఎంపీ టీసీలు, పంచాయతీ సిబ్బందితో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

గరివిడి పశువైద్య కళాశాల పరిశీలన



కళాశాలను సందర్శిస్తున్న వీటీఐ బృందం

గరివిడి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): గరివిడిలో గల పశువైద్య కళాశాలను మంగళవారం వీటీఐ ఇన్‌స్పెక్షన్ టీం సందర్శించింది. ప్రొఫెసర్ డాక్టర్ టి.కుమార్ మండల్, డాక్టర్ ఏపీ జోక్, డాక్టర్ వీఎస్.వాసుదేవన్‌తో కూడిన బృందం కళాశాలలో విద్యా బోధనకు వసతులు, బోధనా సిబ్బంది పనితీరు ఏవిధంగా ఉన్నదీ పరిశీలించేందుకు మంగళవారం వచ్చారు. మరో రెండు రోజులపాటు ఈ కళాశాలను ఈ బృందం పరిశీలించనున్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన విద్యా దీవెన, వసతి దీవెన మంజూరు చేయకపోవడంతో కళాశాలలు ఫీజులు చెల్లించాలని తమపై ఒత్తిడి తీసుకుని వస్తున్నాయని విద్యార్థులు ఆరోపించారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యం ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఉన్నతాధికారులపై చర్యలు తీసుకో వాలని కోరారు. లేని పక్షంలో దీనిపై మరింత పోరాటం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలోని విద్యార్థి సంఘ నాయకులు సాయికుమార్ తదితరులున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కొత్తవలసలో భారీ మోసం

కొత్తవలస, నవంబరు12(ఆంధ్రజ్యోతి): తమతో చేతులతో కలిపి వ్యాపారం చేసినా, వడ్డీకి డబ్బులు ఇచ్చినా అత్యధికంగా లాభాల పొందొచ్చంటూ కొత్తవలసలో ఒక ముఠా నమ్మించింది. సుమారు రూ. యాభై లక్షల వరకూ దోచుకుంది. దీనికి సంబంధించి కొంతమంది బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై కొత్తవలస సీఐ షణ్ముఖరావు మంగళవారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వెనుక ఉన్న శారదానగర్ కేంద్రంగా ఒక ముఠా సభ్యులు వివిధ ప్రాంతాలకు చెందిన వారి నుంచి డబ్బులు వసూలు చేశారు. సీసీ కెమెరాల ప్రోజక్టులో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ ఆశ చూపించి 52 లక్షల రూపాయల వరకు మోసాలకు పాల్పడ్డారు. శారదానగర్‌లో రాణి, ఆమె భర్త శ్రీనివాసరావు, విశాఖలో నివాసం ఉంటున్న సోదరి కలిసి సీసీ కెమెరాల ప్రోజక్టు నిర్వహిస్తున్నామని, తమతో చేతులు కలిపి పెట్టుబడితే లాభాలు వస్తాయని నమ్మించి స్థానికంగా నివాసం ఉంటున్న వారిని నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేశారు. వీరిలో కుమ్మర బంజరులో నివాసం ఉంటున్న మాధవి అనే మహిళ అధికంగా ముట్ట చెప్పిందన్నారు. గత కొద్ది రోజులుగా వీరు స్పందించక పోవడంతో డబ్బులు ఇచ్చిన వారిలో ఆందోళన మొదలైంది. గత నెల 4 వ తేది నుంచే పరారీ అయినట్టు తెలియడంతో పోలీసులను ఆశ్రయించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

చీపురుపల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరపొదిలాం గ్రామంలో అనధికారికంగా నిలువ ఉంచిన 72 మద్య బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎల్. దామోదరరావు తెలిపారు. మంగళవారం జరిపిన దాడిలో ఈ బాటిళ్లు లభించినట్టు ఆయన తెలిపారు. గేదెల నీలంనాయుడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి రేకుల ఇల్లు ధ్వంసం

సంతకవిటి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అక్కరాపల్లి గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రేకుల ఇల్లు ధ్వంసమయ్యింది. గ్రామంలోని మొ య్యి సీతయ్యమ్మకు చెందిన ఇంట్లో ఒక్కసారిగా గ్యాస్ పేలడంతో శబ్దం విన్న స్థానికులు భయాందోళన చెందారు. మంటలు, పొగలు చెలరేగడంతో రాజాం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం సంభవించిందని ఫైర్ ఎస్సై టి.ఎస్.ఎస్. జనార్దనరావు తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

రామభద్రపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గూలవీధికి చెందిన బాలుడు కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక గూలవీధికి చెందిన పత్తిగుళ్ల మహేష్ వీధిలో ఆడుకుంటుండగా ఒకేసారి మూడు కుక్కలు మీదపడి కరిచాయి. దాంతో ఆ బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కుక్కల కాట్లు చూసి భయపడిన స్థానికులు వెంటనే స్పందించి ఆ బాలుడిని స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడ వైద్య సిబ్బంది చికిత్స చేసి రేబిస్ వ్యాక్సిన్ వేశారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

బొండపల్లి, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన అలుగోలు అప్పన్న(62) బొండపల్లి సమీపంలో రైల్వే ట్రాకు దాటుతుండగా పాసింజర్ రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విజయనగరం రైల్వే హెచ్‌సీ ఈశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తుండగా మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలిచారు.

తరలిన మద్యం దుకాణం

వంగర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మద్దువలసలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని నిర్వాహకులు ఎట్టకేలకు తరలించారు. గ్రామం మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు గత వారం రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఇది గమనించిన అధికారులు షాపు నిర్వాహకుడికి సూచన చేయడంతో మద్యం దుకాణాన్ని మద్దువలస నుంచి కొండవలస జంక్షన్‌కు మంగళవారం మార్చారు. దీంతో అంతా హర్షం వ్యక్తం చేశారు.

'ఫిష్ ఆంధ్ర'లో అవకతవకలు

● అధికారుల పరిశీలనలో తెలిసిన నిజాలు



మాట్లాడుతున్న ఎంఎంనాయక్

సంతకవిటి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఫిష్‌ఆంధ్ర పేరుతో రాష్ట్రంలో ఎక్కడికక్కడ వైసీపీ సానుభూతిపరులకు షాపులు కట్టబెట్టారు. అయితే లక్షలాది రూపాయలు నిజమైన షాపులు పెట్టుకున్న వారికి కాకుండా వైసీపీ సానుభూతి పరుల అకౌంట్లకు నగదు జమ అయినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని గుళ్ల సీతారాపురం వద్ద 'ఫిష్ ఆంధ్ర' పథకంలో భాగంగా పున్నమ్మ లైవ్ ఫిష్ సెంటర్‌ను బొద్దూరు గ్రామానికి చెందిన దువ్వారపు శ్రీనివాసరావు ఏర్పాటు చేశారు. ఈ లైవ్ ఫిష్ సెంటర్‌ను మంగళవారం ఫిషరీస్, యానిమల్ హస్బెండరీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్.ఎమ్.నాయక్ పరిశీలించారు. యూనిట్ పరిశీలన అనంతరం సెక్రటరీ వద్ద యజమాని శ్రీనివాసరావు తనకు రావలసిన సబ్సిడీ మొత్తం ఇప్పించాలని మొర పెట్టుకున్నారు. దీనితో పక్కనే ఉన్న డీఎస్‌వోను సెక్రటరీ ప్రశ్నించగా సబ్సిడీ మొత్తం జమయ్యిందని తెలిపారు. దీనితో శ్రీనివాసరావు మా అకౌంట్లో జమ కాలేదని, ప్రైవేట్ వెండర్ ఆ మొత్తాన్ని జమ చేసుకున్నారని సెక్ర టరీకి వెల్లడించారు. ఈ వ్యవహారంపై అధికారులు ఆరా తీశారు. ఫిషరీస్ అండ్ యానిమల్ హస్బెండరీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ మాట్లాడుతూ దీనిపై పరిశీలన జరిపి సబ్సిడిలో అవకతవకలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని, యజమానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు రవీంద్ర, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, డీపీఎం ఏకలవ్య, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ ఎస్. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోసపోయాం.. ఆదుకోవాలి

భోగాపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): నారుపేటకు చెందిన ఓ వ్యక్తి తమకు ప్లాట్లు ఇస్తామని నమ్మించి డబ్బులు తీసుకుని మోసం చేశాడని జామి వెంకటనాగరాజు, ఆర్.కృష్ణవేణి, పిల్లా నానాజీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భోగాపురం గ్రామంలో వారు మంగళవారం విలేకర్ల మాట్లాడారు. నారుపేటకు చెందిన వ్యక్తి గ్రూప్ హౌస్ ఇస్తామని చెప్పి 2013లో రూ.6.8లక్షలు తీసుకున్నారని, తర్వాత చూస్తే తనకిచ్చిన ఫ్లాట్ వేరే అతనికి రిజిస్ట్రేషన్ చేశాడని, అడిగితే డబ్బులు ఇస్తేస్తామని అంటున్నాడే గానీ ఇవ్వడం లేదని అన్నారు. అలాగే డెంకాడకు చెందిన ఆర్.కృష్ణవేణి దగ్గర రూ.10లక్షలు, రఘుమండకు చెందిన నానాజీ దగ్గర రూ.5లక్షలు తీసుకున్నట్టు తెలిపారు. డబ్బులు తిరిగి అడిగితే దౌర్జన్యంగా మాట్లాడుతున్నాడన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్క్ షాపులో లలిత కుమారి

శృంగవరపుకోట, నవంబరు12(ఆంధ్రజ్యోతి): శాసనసభలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్క్ షాపులో శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొన్నారు. బడ్జెట్‌పై ఎమ్మెల్యేలకు అవగాహన ఉండాలని, ఆలోచనలు పంచుకోవాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు సూచించారని ఆమె స్థానిక విలేకర్లకు పేర్కొన్నారు.

బాధ్యతగా పని చేయాలి

వంగర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని రాజాం సీఐ ఉపేంద్రరావు సూచించారు. మంగళవారం మహిళా సిబ్బందితో పోలీసుస్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యంగా గ్రామాల్లో పోలీస్ సిబ్బంది మొక్కుబడిగా విధులు నిర్వహించటం సరికాదన్నారు. అపరిచుతుల పట్ల నిత్యం నిఘా ఉంచాలన్నారు. ఎస్సై శంకర్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

బొబ్బిలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో జరగనున్న ఏఐఎస్‌ఎఫ్ 49 వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ సెంటరులో మంగళవారం సాయంత్రం గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఈ మహాసభలలో అర్థవంతమైన చర్చ జరుగుతుందన్నారు.

స్పందించి.. వేదన తీర్చి..

(ఐదో పేజీ తరువాయి)

ఇకపై వేతనాలు 'ఉపాధి' నుంచి రాగా, విధుల నిర్వహణ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ పనులు జరుగుతున్న దృష్ట్యా ముందుగా ఉమ్మడి జిల్లా పరిధిలో 81 మంది సిబ్బంది ఖాతాల్లో అక్టోబరు నెల వేతనాలను జమ చేశారు.

రుణపడి ఉంటాం..

గత వైసీపీ సర్కారు హయాంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాపై కరుణ చూపడం ఆనందంగా ఉంది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలు తెలుసుకుని స్పందించిన మంత్రులు, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- ఎస్.రాజారావు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆదేశాలు అందాయి

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు ఉపాధి హామీ పథకం నుంచి వేతనాలు మంజూరు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మొదటిగా అక్టోబరుకు సంబంధించి వేతనాలు విడుదల చేశాం. ఉమ్మడి జిల్లాల పరిధిలోని 81 మందికి పైగా సిబ్బందికి బకాయి పడిన వేతనాలను విడతల వారీగా జమ చేస్తాం.

- కె.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

బైకుపై నుంచి జారిపడి మహిళ మృతి

కొమరాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వపాడు గ్రామానికి చెందిన కె.కాంతమ్మ(45) అనే మహిళ ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడి మృతి చెందింది. ఈ ఘటనపై ఎస్ఐ నీలకంఠం మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. సర్వపాడు గ్రామానికి చెందిన కొండగొర్రి సింగురు, కాంతమ్మ(45)లకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కూతురు ఐశ్వర్య కొమరాడ కేజీబీవీలో చదువుతోంది. ఐశ్వర్యను కలిసేందుకు కాంతమ్మ తన వరుసకు అల్లుడైన వ్యక్తితో కలిసి ఆదివారం బైకుపై వెళ్లింది. తిరుగు ప్రయాణంలో కొమరాడ కొత్తవలస గ్రామ సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద రోడ్డుపై జారిపడింది. దీంతో తీవ్ర గాయాలపాలైంది. వెంటనే పార్వతీపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

వీరఘట్టం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిగుంట గ్రామానికి చెందిన ఎచ్చెర్ల త్రినాథరావు(53) గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈక్రమంలో ఈనెల 10న గడ్డి మందు తాగా ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.కళానిధి తెలిపారు.

గజరాజుల బీభత్సం



మట్టిలో కలిసిపోయిన మొక్కజొన్న కంకులను సేకరిస్తున్న రైతులు

కొమరాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తోంది. సోమవారం రాత్రి కుమ్మరిగుంట, కంబవలస, కందివలస, తదితర గ్రామాల్లోని పంట పొలాల్లో ఏనుగులు సంచారించాయి. ఈ సమయంలో కంబవలసకు చెందిన గొర్లి సంగీతకు చెందిన మొక్కజొన్న గింజలను తొక్కిపెట్టి మట్టిలో కలిపేశాయి. సుమారు 50 బస్తాలకు పైగా మొక్కజొన్న గింజలు పాడైనట్లు బాధిత రైతు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏనుగులు ఈ ప్రాంతం నుంచి తరలించాలని కోరుతున్నారు.

దిగుబడి నిర్ధారించేందుకే పంట కోత ప్రయోగాలు

సీతానగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వరి పంట దిగుబడిని నిర్ధారించేందుకే పంట కోత ప్రయోగాలు చేపడుతున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సతీష్ అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా వ్యవసాయ, రెవెన్యూశాఖల పర్యవేక్షణలో మండలంలో 128 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నట్టు తెలిపారు. మంగళవారం జోగింపేటలో సీతారామానాయుడు పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 16,090 కిలోలు దిగుబడి వచ్చిందన్నారు. అలాగే ఖాసపేటలో గౌరమ్మ పొలంలో నిర్వహించగా 16,050 కేజీల దిగుబడి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అవినాష్, వీపీఏలు జగదీష్, రాకేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఇన్సూరెన్స్ బ్యాంకు ఏజెంట్, రైతులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులపై అవగాహన సదస్సు

సీతంపేట రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కులు, చట్టాలపై ఈనెల 14న స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఎస్ఐ అమ్మన్నరావు తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన వివరాలను ఓ ప్రకటనలో వెల్లడించారు. ఏపీ నేర పరిశోధన విభాగం (సీఐడీ)అధిపతి శ్రీరవిశంకర్ అయ్యన్నార్, అడిషనల్ డీజీపీల ఆదేశాల మేరకు విశాఖపట్నం సీఐడీ రీజనల్ అధికారి ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తామని చెప్పారు.

హెల్మెట్ తప్పనిసరి

సాలూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని యువజన సర్వీసుల శాఖ సీఈవో బి.రామగోపాల్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సెట్విజ్, నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ అప్పలనాయుడు, నీడ్ వేణుగోపాలరావు, ఎంవీఐ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కళలు మానసిక ప్రశాంతతకు నిలయాలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఒడిశా

రాయగడ: కళలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ప్రముఖ కవి, విశాఖపట్నం కామెడీ క్లబ్ కార్యదర్శి మేడా మస్తాన్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రామలింగేశ్వర ఆలయంలోని స్పందన కార్యాలయంలో నిర్వహించిన స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రశంగించారు. స్పందన అధ్యక్షుడు గుడ్ల గౌరీ శంకరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ఆయన తోపాటు ప్రముఖ రంగస్థల నటుడు వర్రే నాంచారయ్య పాల్గొని, మాట్లాడారు. జెమ్స్ విద్యాసంస్థ అధినేత ఏవీఎస్ గిరికి, ప్రముఖ వ్యాపారి సూరు రాధాకృష్ణకు సన్మానించారు. అనంతరం విద్యార్థినులు చేసిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. సంస్థ కార్యదర్శి డాక్టరేటర్ పతివాడ తులసీదాస్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. సీనియర్ సభ్యులు భళ్లమూడి నాగరాజు, పిల్లల శంకరరావు, సాంస్కృతిక కార్యదర్శి కేకేఎం పట్నాయక్, లాడి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట రోడ్డులోని సీఎల్ నాయుడు కాలనీలో చేరిన సాగునీరు



నీరు నిల్వ ఉండడంతో గుంతల మయంగా మారుతున్న రహదారి

రహదారులపై సాగునీరు

- కాలువ ఆక్రమణ కారణంగా జనావాసాల్లోకి..
- తీవ్ర అవస్థలు పడుతున్న కాలనీల వాసులు
- చర్యలు తీసుకోని నీటి పారుదల శాఖాధికారులు

పాలకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ ద్వారా విడుదల చేస్తున్న సాగునీరు వృథాగా పోతోంది. నిన్న మొన్నటి వరకు వర్షాభావంతో తోటపల్లి ఎడమ కాలువల ద్వారా సాగునీరు అందని పరిస్థితి. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరం కావడంతో తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ పరిధిలోని వ్యవసాయ భూములకు సాగునీరు అవసరం లేదు. దీంతో సాగునీరు అంతా ఎడమ కాలువ పరిధిలోని 7, 8 బ్రాంచిల శివారు భూములకు అందుతుంది. పాలకొండ మండలం పరిధిలో పాలకొండ, సింగన్నవలస, వడమ తదితర గ్రామాలకు వెళ్లే కాలువ ఆక్రమణలకు గురికావడంతో సాగునీరు అంతా ప్రధాన రహదారిపైకి చేరుతోంది. దీంతో రహదారి మరమ్మతులకు గురవుతోంది. పాలకొండ-సీతంపేట రహదారిలో సాగునీరు ప్రవహించడంతో రహదారి గుంతల మయంగా మారుతోంది. అలాగే సీఎల్‌నాయుడు కాలనీ తదితర కాలనీల్లో వరదనీరు ప్రవేశించడంతో ఆయా కాలనీ వాసులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాలకొండ పట్టణం, వడమ పరిధిలో కాలువలను ఆక్రమణలను తొలగించి సాగునీరు సద్వినియోగం అయ్యేలా నీటి పారుదల శాఖాధి కారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హైరిస్క్ గర్భిణులపై దృష్టి సారించాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కరుణ

బెలగాం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ అన్నారు. జిల్లాలోని రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రితో పాటు బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంసీహెచ్, ట్రైబుల్ సెల్‌లో రోగుల వివరాల రికార్డును పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు బాగున్నాయని, మరింత మెరుగైన వైద్యం అందించేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. డీఎంహెచ్‌వో విజయపార్వతి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా.వినోద్ పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులకు తెలియజేస్తా..

సాలూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైటీసీలో నిర్వహిస్తున్న గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతి గృహాన్ని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వి.కరుణ మంగళవారం సందర్శించారు. గర్భిణులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బంది.. ఇక్కడ చాలా మందికి జీతాలు లేవని, డైట్ చార్జీలు అందటం లేదని, కేవలం రూ.120తో గర్భిణికి పౌష్టికాహారం పెట్టడం ఎలా సాధ్యమని తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ విషయాలను పూర్తి స్థాయిలో ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానని ఆమె తెలిపారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో కె.విజ యపార్వతి, నోడల్ అధికారి వినోద్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ అప్పారావు, నీడ్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

108 సేవలపై ఫిర్యాదు

పార్వతీపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 108 అంబులెన్స్‌లు సకాలంలో రావడం లేదని, దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కరుణకు పలువురు పీహెచ్‌సీ వైద్యులు ఫిర్యాదు చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా జరిగిన సమావేశంలో వైద్యులు స్వయంగా ఫిర్యాదు చేశారు. 108 అంబులెన్స్ ద్వారా ప్రజలకు అందాల్సిన సేవల్లో జాప్యం జరిగితే సహించేది లేదని కమిషనర్ హెచ్చరించారు. ఇకపై ఇటువంటి ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు.



సాలూరు: గర్భిణులతో మాట్లాడుతున్న కమిషనర్ కరుణ

ఎఫ్ఆర్ఎస్‌లో లోపాలు సవరించండి

ఎఫ్ఆర్ఎస్‌లో ఉన్న లోపాలను సవరించాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిషోర్ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం హెల్త్ కమిషనర్ కరుణకు వినతిపత్రం అందించారు. ఫేషియల్ రికాగ్నైజేషన్ సిస్టం వ్యతిరేకం కాదని, కానీ అందులో లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబరు నెలలో జీతాలు కోల్పోయి ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు జీతాలను చెల్లించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

మెరుగైన సేవలందించండి

గరుగుబిల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ సీనియర్ అధికారి ప్రతిభ, కన్సల్టెంట్ శ్రీకాంత్ సూచించారు. మంగళవారం గరుగుబిల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఆర్‌డీ వలస, ఉద్దవోలు గ్రామాల్లో ఆయుష్మాన్ కేంద్రాలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ ఆయూష్మాన్ పరిధిలో 105 రకాల మందులతో పాటు 14 రకాల పరీక్షలకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఈ పరశీలనలో వైద్యాధికారులు ఉన్నారు.

15న జాతీయ గౌరవ దివస్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జన్ జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని ఈనెల 15న ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. మంగళవారం ఆయన పార్వతీపురంలోని తన కార్యాలయంలో సెక్టోరల్ అధికారులతో సమీక్షించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు.

జీడి పంటకు బీమా చేసుకోవాలి

సీతంపేట రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జీడి పంటకు గిరిజన రైతులు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారిణి శ్రీదేవి సూచించారు. మంగళవారం ఓ ప్రకటనలో వివరాలను ఏవో వెల్లడించారు. వాతావరణ ఆధారిత బీమాను రబీ పంట కాలం నుంచి రైతులు ఐదు శాతం ప్రీమియం చెల్లించాలని తెలిపారు. జీడి పంటకు ఎకరాకు రూ.1600 చెల్లించాలని అన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట నష్టం జరిగితే మండలం యూనిట్‌గా పరిగణించి ఎకరాకు రూ.32వేలు బీమా పొందే అవకాశం ఉందని తెలిపారు. రైతులు సమీపంలోని మీసేవ కేంద్రంలో సంప్రదించి రైతు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఫోన్ నెంబర్ ఇచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు. బీమా నమోదుకు ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే సమయం ఉందని తెలిపారు.

ఎమ్మెల్యేలకు అవగాహన సదస్సు

పార్వతీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు బడ్జెట్‌పై వారికి అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జిల్లాకు చెందిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర హాజరయ్యారు.



మాట్లాడుతున్న చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యేలు, మంత్రులు

ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- మహిళా సంఘాల సభ్యులకు 'ఉల్లాస్' శిక్షణ

బలిజిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్షర జ్ఞానానికి మించిన ఆస్తిలేదని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యతను గుర్తించి వారికి అక్షర జ్ఞానం కల్పించేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్య క్రమంలో వలంటరీ టీచర్స్, వీవోఏలు, వెలుగు సీసీలు, ఈవోఆర్‌డి పుష్పరాజ్, వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

- సీతానగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో మండల వెలుగు అధికారి ఆర్.శ్రీరాములు ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల మహిళలతో ఉల్లాస్ కార్యక్రమంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో త్రివిక్రమరావు ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా మొదటి రోజు 18 గ్రామాలకు, రెండో రోజు మరో 18 గ్రామాలకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి గ్రామైక్య సంఘాల పరిధిలో 30 మంది చొప్పున మహిళల నిరక్షరాస్యతను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన యువతతో డిజిటల్ పద్ధతిలో చదువు నేర్పిస్తామని చెప్పారు. ఎంఈవో సూరిదేవుడు, వెలుగు సిబ్బంది, సీసీలు, వీవోఏలు, వీవోలు పాల్గొన్నారు.

- వీరఘట్టం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో గ్రామాల్లో ఎంపిక చేసిన స్వచ్ఛంద కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఏపీఎం కె.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

- సీతంపేట రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఆధ్వర్యంలో వీవోఏ, సీసీలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా అడల్ట్ ఎడ్యుకేషన్ ఏడీ వైకుంఠరావు మాట్లాడుతూ నిరక్షరాస్యులకు వారికి అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మాస, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు సర్వే నిర్వహించాలి

గరుగుబిల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో ఇంటింటా సర్వేను నిబంధనల మేరకు నిర్వహించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు సూచించారు. మంగళవారం రావుపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను వీరు పరిశీలించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు లేని వారికి పోస్టల్‌లో ఖాతాలను తెరిపించాలన్నారు. బ్యాంకుకు సంబంధించి ఎన్‌పీసీఐతో లింక్ చేయించాలన్నారు. ఈనెల 25లోగా జియో ట్యాగింగ్‌ను పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శి బి.సాయికృష్ణతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మన బడి - మన తోటతో పౌష్టికాహారం లభ్యం



విద్యార్థులతో విత్తనాలు వేయిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

జియ్యమ్మవలస, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో మన బడి - మన తోట కార్యక్రమంలో భాగంగా పండిస్తున్న ప్రకృతి సేద్య కాయగూరలు వల్ల పౌష్టికాహారం లభిస్తుందని జిల్లా డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మంగళవారం చిత్తరపాడు ప్రభుత్వ యూపీ స్కూల్ ఆవరణలో ఆకుకూరలు, తీగ జాతుల విత్తనాలు వేశామని చెప్పారు. హెచ్‌ఎం హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



గుమ్మలక్ష్మీపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం కస్తూర్బా పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీరంజని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఈసందర్భంగా మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖామంత్రి నారా లోకేష్ ఆమెకు అవార్డు అందజేసి, సన్మానించారు. ఇది తన అదృష్టం గా భావిస్తున్నానని శ్రీరంజని తెలిపారు.

న్యూస్ బాక్స్

15 ఇసుక ట్రాక్టర్లు సీజ్

పాలకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగళాపురంలోని నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిపోతోంది. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఆ ఇసుక ర్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న సుమారు 15 ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో సబ్ కలెక్టర్‌తో పాటు రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు 'గురుబ్రహ్మ'

పార్వతీపురంటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు టి.రవికుమార్‌ను విశాఖపట్నానికి చెందిన మదర్ థెరిస్సా సోషల్ ఆర్గనైజేషన్ గురుబ్రహ్మ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు డీఐఈవో డి.మంజులా వీణ చేతులమీదుగా మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. ఈయనకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

పార్వతీపురంటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు కోరారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా మంగళవారం కొత్తవలసలోని వార్డుల్లో ర్యాలీ చేశారు.

విశాఖ ఉక్కును పరిరక్షించండి

సాలూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖను పరిరక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మామిడిపల్లిలో సీపీఎం ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును వివరించారు. సాలూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఈనెల 14న నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ప్రజలంతా పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మర్రి శ్రీనివాసరావు, జానకీరావు, సుందరరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పాటుపడాలి

సీతంపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి అందరూ పాటుపడాలని ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ అన్నారు. మంగళవారం స్థానిక వైటీసీలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీవోఏలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ఈవోపీఆర్డీ కె.సత్యం, ఏవో మాస పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అవగాహన ఉండాలి

వీరఘట్టం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో డి.వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లుకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పంచాయతీ అభివృద్ధి, ప్రణాళిక, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై వివరించారు. పీవో సత్యనారాయణ, ఏపీఎం రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కావ్యశ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమణ